నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, బుధవారం 12 ఫిబ్రవరి 2025 | ADILABAD NIRMAL

క్రికెట్ ఆడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలి
మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, ఫిబ్రవరి 11 : క్రీడాకారులకు తగు ప్రోత్సాహం అందిస్తూ వారు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా తమ వంతు కృషి చేస్తున్నామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మండలంలోని దీపాయి గూడకు చెందిన కృషి యూత్ ఆధ్వర్యంలో జోగు ఆశన్న-భోజమ్మల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం మాకోడ గ్రామంలోని క్రీడా మైదానంలో ప్రారంభించారు. టాస్ వేసి, క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. సరదాగా బ్యాటింగ్, బౌలింగ్ చేస్తూ అక్కడున్న వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మార్కెట్టి గోవర్ధన్, వేణు యాదవ్, బట్టు సతీశ్, బొల్లి గంగన్న, చైతన్య, రామన్న, రాంరెడ్డి, ఊశన్న, సంతోష్, వెంకన్న, మన్మోహన్‌రెడ్డి, సాయి పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 11 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలించినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని గాజులపేట్, రాంనగర్, మంజులాపూర్ ప్రాంతాల్లో నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక పోలీస్ టీం, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని, అనుమతులు లేకుండా జిల్లాలో వేర్వేరు ప్రాంతాల నుంచి ఇసుకను తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 17 ఇసుక రీచ్‌లు, 35 ఇసుక నిల్వలు ఉన్నాయన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ అధికారులతో ఆన్‌లైన్ మీటింగ్ ఏర్పాటు చేసి అక్రమ నిల్వలపై ఆదేశాలను జారీ చేశామన్నారు. జిల్లాలోని గోదావరి, సుద్ద, స్వర్ణ వాగు పరిసర ప్రాంతాల్లో ఇసుక రవాణా జరుగుతుందని, అట్టి ప్రాంతాల్లో విధులు నిర్వహించే పోలీసులకు సూచనలు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో భైంసా ఏఎస్పీ అవినాశ్, ఏఎస్పీ రాజేశ్‌మీనా పాల్గొన్నారు.

నిలిచిన పత్తి కొనుగోళ్లు

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ప్రైవేటు వ్యాపారులకు పత్తిని విక్రయిస్తున్న రైతులు

సీసీఐ కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకే విక్రయాలు
క్వింటాలుకు రూ.6,920.. నష్టపోతున్న రైతులు..

ఆదిలాబాద్, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో పత్తి రైతులు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా నష్టపోవాల్సిన దుస్థితి నెలకున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది పత్తి క్వింటాలుకు రూ.7,521 ధర ప్రకటించింది. జిల్లాలో గతేడాది వానకాలంలో రైతులు సాగు చేసిన పత్తి కొనుగోళ్లు అక్టోబర్ చివరి వారంలో ప్రారంభమయ్యాయి. మొదట తేమ పేరిట కొనుగోళ్లు చేయని సీసీఐ తర్వాత పత్తిలో నాణ్యత తగ్గిందంటూ క్వింటాలుకు రూ.100 తగ్గించి రూ.7,421లతో కొనుగోళ్లు చేస్తున్నది. దీంతో రైతులు భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకున్నది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో రైతుల వద్ద నుంచి పత్తిని కొనుగోలు చేయాల్సిన సీసీఐ కార్పొరేట్ సంస్థల వ్యాపారం చేస్తూ తమను నష్టాలకు గురి చేస్తుందంటూ రైతులు అధికారులకు సూచించినా ఫలితం లేకుండా పోయింది. దళారులు రైతుల పట్టాలు తీసుకుని వచ్చి నాణ్యత లేని పత్తిని భారీగా విక్రయించినా అధికారులు పట్టించుకోలేదని, రైతుల విషయంలో నాణ్యత అంటూ షరతులు విధిస్తున్నారని రైతు సంఘాల నాయకులు అంటున్నారు. జిల్లా మార్కెటింగ్ అధికారులు ధర విషయంలో పట్టించుకోకపోవడంతో రైతులు తప్పని సరి పరిస్థితుల్లో సీసీఐకి పంటను విక్రయిస్తున్నారు.



కొనుగోళ్లను నిలిపివేసిన సీసీఐ

ఆదిలాబాద్ జిల్లాలో పత్తి విక్రయాలు చివరి దశకు చేరుకున్నాయి. రైతులు పండించిన మొత్తం పంటను కొనుగోలు చేయాల్సిన సీసీఐ రెండ్రోజులుగా విక్రయాలను నిలిపివేసింది. సీసీఐ సర్వర్ సమస్య కారణంగా పంటను కొనుగోలు చేయడం లేదని మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రకటించారు. దీంతో రైతులు పంటను ప్రైవేటు వ్యాపారులకు అమ్మి నష్టపోతున్నారు. ప్రైవేటులో క్వింటాలుకు రూ.6920 ఉంది. సీసీఐ కొనుగోలు చేస్తున్న ధర కంటే క్వింటాలుకు రూ.500 తక్కువకు సీసీఐ కొనుగోలు చేస్తున్నది. మంగళవారం సీసీఐ పంట కొనుగోళ్లు నిలిపివేసిన విషయం తెలియని రైతులు ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు పత్తిని తీసుకొచ్చారు. తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ ధరకు పంటను ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. జిల్లాలో మూడు నెలలకుపైగా సీసీఐ పత్తి కొనుగోలు చేస్తున్నా.. ఏ ఒక్కరోజు సర్వర్ సమస్య రాలేదని, పంట విక్రయాలు చివరి దశకు చేరుకున్న సమయంలో సీసీఐ అధికారులు ముందుస్తు ప్రణాళికలో భాగంగా సర్వర్ సమస్య అంటూ విక్రయాలు నిలిపివేశారని రైతు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీసీఐ తీరుతో నష్టపోతున్నారు..

నేను వంద కిలోమీటర్ల దూరం నుంచి 20 క్వింటాళ్ల పత్తిని ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. నార్నూర్, ఇంద్రవెల్లి మార్కెట్ యార్డులో పంటను కొనుగోలు చేయకపోవడంతో సీసీఐకి అమ్మడానికి ఇక్కడికి వచ్చా. మార్కెట్ యార్డుకు వచ్చిన తర్వాత సీసీఐ పత్తిని కొనుగోలు చేయడం లేదని అంటున్నారు. చాలా దూరం నుంచి పత్తిని తీసుకొచ్చా. కొనుగోలు చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులు కోరినా వారు తాము ఏమీ చేయలేమని అన్నారు. దీంతో క్వింటాలుకు రూ.6920 కి ప్రైవేటు వ్యాపారులకు విక్రయించా. మార్కెటింగ్, సీసీఐ అధికారుల వైఖరి కారణంగా రూ.10 వేలు నష్టపోయా.

- లింబారావు, రైతు, పర్సువాడ, నార్నూర్ మండలం

రేవంత్‌కు సీఎం పదవి శాశ్వతం కాదు

● మరోసారి బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ● మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, ఫిబ్రవరి 11 : సీఎం రేవంత్ రెడ్డికి సీఎం పదవి శాశ్వతం కాదని అధికార దాహంలో బీసీ గణనలో 60 లక్షల నుంచి 70 లక్షల వరకు బీసీలను లెక్కల్లో లేకుండా తప్పించడం సరికాదని బీసీ సంక్షేమ శాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మండిపడ్డారు. ఆదిలాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పుల తడకగా ఉందని, కాంగ్రెస్ పుట్టిన నాటి నుంచి నేటి వరకు బీసీలను మోసం చేస్తూనే వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన బీసీలకు అన్యాయం చేకూర్చేలా ఉందన్నారు. 2011 సెన్సెస్ ప్రకారం తెలంగాణలో 3.50 కోట్ల జనాభా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుల తడక లెక్క చూపెడుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ప్రకారం, ఎలక్షన్ మిషన్ చెప్పిన లెక్కల ప్రకారం, 2011 సెన్సెస్ ప్రకారం చూస్తే పదేళ్ల తర్వాత 4.30 కోట్లకు పైగా జనాభా ఉన్నప్పటికీ ఈ నివేదికలను ప్రస్తుత ప్రభుత్వం నమ్మకపోవడం సరికాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బీసీలు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. 42 శాతం బీసీల రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పిస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాల మధ్య రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిచ్చుపెట్టే ఆలోచన మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో గండ్రత్ రమేశ్, దాసరి రమేశ్, ఆప్కామ్ గంగయ్య, పండ్ల శ్రీనివాస్, కొండ గణేశ్, సాజిదుద్దీన్, నవతే శ్రీనివాస్, దమ్మపాల్, బట్టు సతీశ్, పందిరి భూమన్న, కుమ్ర రాజు, పరమేశ్వర్, జంగిలి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

మార్కెట్ యార్డును సందర్శించిన ఏడీ

ఎదులాపురం, ఫిబ్రవరి 11 : రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు మద్దతు ధర అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వసతులు, పంటల వివరాలను తెలుసుకుంటుందని రాష్ట్ర మార్కెటింగ్ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ అన్నారు. రాష్ట్ర మార్కెట్ పర్యటనలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. ఇక్కడ కల్పిస్తున్న వసతులు, కొనుగోళ్లు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు కనీస మద్దతు ధర కల్పించడానికి ప్రభుత్వం మార్కెట్ యార్డులను సందర్శించి స్థితిగతులను తెలుసుకోవాలని సూచించిందన్నారు. అందులో భాగంగానే ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి వివరాలను సేకరించామని నివేదికను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. జిల్లాలో ఈ యేడాది 4 లక్షల 33 వేల ఎకరాల్లో పత్తి సాగైందని, 32 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారన్నారు. సీసీఐ ద్వారా ఇప్పటి వరకు 25 లక్షల క్వింటాళ్లు, ప్రైవేట్ వ్యాపారులు 1.67 లక్షల క్వింటాళ్లను మాత్రమే కొనుగోళు చేశారన్నారు. ప్రైవేట్ కంటే సీసీఐ ధర ఎక్కువగా ఉండడంతోనే రైతులు కూడా సీసీఐకే విక్రయించారన్నారు. అయితే ఆధార్ సర్వర్‌లో సాంకేతిక లోపం కారణంగా కొనుగోళ్లను నిలిపివేశారని, దీనిని పునరుద్ధరించి మళ్లీ కొనుగోళ్లు చేస్తారన్నారు. అదే విధంగా మార్క్‌ఫెడ్ ద్వారా ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసి కందులను కొనుగోలు చేస్తున్నామన్నారు. అయితే ఎకరానికి 3 క్వింటాళ్ల 30 కిలోల పరిమితి ఉందని, దానిని 6 నుంచి 10 వరకు పెంచాలని రైతులు కోరుతున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. రైతులు మార్కెట్ యార్డుల్లోనే తమ పంటలను విక్రయించాలని కోరారు. ఆయనతోపాటు జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, సెలెక్షన్ గ్రేడ్ కార్యదర్శి మధూకర్, గ్రేడ్-3 కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర మార్కెటింగ్ అడిషనల్ డైరెక్టర్ రవి కుమార్

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు
నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 11 : భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్ శాఖలకు సంబంధించి భూ సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి పాల్గొన్నారు. రెవెన్యూ, పోలీసు కేసులతో ముడిపడి ఉన్న భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలని, సమస్యల పరిష్కారానికి రెవెన్యూ, పోలీసు అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ స్పందన కార్యక్రమం ద్వారా జిల్లాలో చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న పలు భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. పోలీసు శాఖతో ముడిపడి ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రతి మంగళవారం తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేశ్ మీనా పాల్గొన్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహించాలి

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 11 : ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధులు, నిబంధనల వంటి అంశాలపై ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 31 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రూట్, జోనల్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి వసతులను పరిశీలించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నిల విధులు, నిబంధనలపై మాస్టర్ ట్రైనర్లు రవి, లింబాద్రి ఎన్నికల ముందు, తర్వాత నిర్వహించాల్సిన విధులపై అధికారులకు శిక్షణ కల్పించారు.

రెండో బెటాలియన్‌లో వైద్య శిబిరం

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్

ఎదులాపురం, ఫిబ్రవరి 11 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్ గూడలో గల రెండో బెటాలియన్‌లో మంగళవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా బెటాలియన్ కమాండెంట్ నితికా పంత్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌తో కలిసి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ.. వంద రోజుల టీబీ ప్రచారంలో భాగంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బెటాలియన్ పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు టీబీ, ఎన్‌సీడీ, హెచ్‌టీఎన్, డయాబెటిస్‌తోపాటు వివిధ రకాల పరీక్షలు చేశామని తెలిపారు. అలాగే అవసరమైన వారి నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షల కోసం టీ-హబ్‌కు పంపించామని పేర్కొన్నారు. అలాగే చాతి ఎక్స్‌రే కోసం రిమ్స్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. బెటాలియన్‌లో వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వారి వెంట డీటీసీవో సుమలత, ఎన్‌సీడీ పీవో డాక్టర్ శ్రీధర్ ఉన్నారు.

గో కార్డింగ్ వాహన గరుడ 2.0 ను ప్రారంభించిన వీసీ

బాసర, ఫిబ్రవరి 11 : బాసర ట్రిపుల్ ఐటీలో మంగళవారం వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ గో కార్డింగ్ వాహన గరుడ 2.0ను ప్రారంభించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు రూపొందించిన ఈ వాహనాన్ని వీసీ ప్రారంభించి మాట్లాడారు. ఈ వాహనం ఫిబ్రవరి 19 నుంచి 23 వరకు కోయంబత్తురులో జరగనున్న ప్రతిష్టాత్మకమైన జీవో కార్డ్ డిజైన్ చాలెంజ్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉందన్నారు. దీనికి అభివృద్ధి చేసిన విద్యార్థులను ప్రశంశించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ మురళిదర్శన్ పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన విద్యార్థులు

ట్రిపుల్ ఐటీ విద్యార్థులు మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశారు. వీసీ గోవర్ధన్ నేతృత్వంలోని ఆర్జీయూకేటీ విద్యార్థులు, అధ్యాపకుల బృందం గవర్నర్‌తో సమావేశమై గ్రామీణ రాష్ట్ర ఔత్సాహిక రంగాన్ని ప్రోత్సాహించే కార్యక్రమాలపై చర్చించారు. విద్యార్థులు మనీశ్, స్వర్ణలత, జావేద్‌లతో కూడిన బృందం గ్రామీణ సామర్థ్యాలను వెలికితీయడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఇంక్యూబేషన్ సెంటర్‌ను స్థాపించడానికి మద్దతు కోరారు. విశ్వవిద్యాలయంలో 10.10 లక్షల స్టార్టప్‌లు ఈవెంట్‌ను నిర్వహించడానికి కూడా మద్దతు అభ్యర్థించారు.

గో కార్డింగ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న వీసీ గోవర్ధన్

చదువుతోపాటు సంప్రదాయాలను నేర్చుకోవాలి

గుస్సాడీ నృత్యం చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదివాసీ విద్యార్థుల సాంస్కృతిక సమ్మేళనంలో కలెక్టర్ రాజర్షి షా

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 11 : పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు చదువులతోపాటు సంస్కృతి, సంప్రదాయాలను నేర్చుకోవాలని ఆదివాసీ విద్యార్థుల సాంస్కృతిక సమ్మేళనంలో కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఆదివాసీ గిరిజ న విద్యార్థుల సాంస్కృతిక సమ్మేళనంలో కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. సరస్వతీ దేవి చి త్రపటానికి పూల మాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయా పాఠశాలలకు చెందిన ఆదివాసీ గిరిజన విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన నృత్యాలను ప్రదర్శించారు.

గుస్సాడీ నృత్యం చేసిన కలెక్టర్

జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆదివాసీ గిరిజన విద్యార్థుల సాంస్కృతిక సమ్మేళనంలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌లు గుస్సాడీ టోపీలు ధరించి, చేతిలో రోకలు దుడ్డును పట్టుకుని గుస్సాడీ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో ప్రణీత, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.